క్లుప్తంగా

రేపు న్యాయవాదులకు తరగతులు

ఖమ్మం లీగల్: సత్తుపల్లిలోని కళాభారతి ఆడిటోరియంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యాన న్యాయవాదులకు రేపు(శనివారం) తరగతులు నిర్వహిస్తామని గురువారం ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. ఈ తరగతులు ఫామిలీ లా , అమెండమెంట్‌లాకు సంబంధించిన విషయాల పై ఉంటాయని పేర్కొన్నారు. ఈ తరగతులను ఉదయం 10 గంటలకు సీనియర్ న్యాయవాది పి.తేజా రెడ్డి, వరంగల్ కోర్టు, ఖమ్మం కోర్టులో పనిచేస్తున్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హనుమంతరావులు బోధిస్తారని చెప్పారు. ఈ తరగతులకు అధిక సంఖ్యలో న్యాయవాదులు హాజరుకావాలన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ గురువారం ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఏబీవీపీ కార్యకర్తలు హెచ్‌సీయూలో విద్యార్థులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సుధాకర్, వంకాయల రాజు, వినోద్, మనోజ్, మహేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు, ఆశీర్వాదాలు..

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: మండలాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గురువారం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభించి, పలు వివాహ కార్యక్రమాలకు హాజరయ్యారు. అనంతరం వరంగల్‌క్రాస్‌రోడ్‌లో ఇటీవల మృతి చెందిన నాగిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే తిరుమలాయపాలెం, పడమటి తండా గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు చావా శివరామకృష్ణ, పోట్ల ప్రవీన్, తాటికొండ కిరణ్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, జియాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో దాడి

నేలకొండపల్లి: వైన్స్ వద్ద జరిగిన ఘర్షణలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. మండలంలోని రాజేశ్వరపురంలో అన్నదానం సందర్భంగా ఏపీలో నివాసముంటున్న వంట మాస్టర్ హరిబాబును బుధవారం గ్రామస్తులు పిలిపించారు. వంటలు పూర్తయ్యాక ఆయన బుధవారం రాత్రి స్థానిక వైన్స్‌కు వెళ్లాడు. అక్కడ గ్రామానికి చెందిన ఇద్దరితో హరిబాబుకు మధ్య గొడవ జరగగా, వెంకటరత్నం అనే వ్యక్తి బీరు బాటిల్‌తో హరిబాబు తలపై కొట్టడమే కాక అదే సీసాతో కడుపులో పొడిచేందుకు యత్నించగా పక్కకు గుచ్చుకుంది. దీంతో స్థానికులు హరిబాబును ఆస్పత్రికి తరలించారు. కాగా, వెంకటరత్నం తనపై దాడి పాల్పడడంతోనే తాను తలపై కొట్టానని తెలిపారు. ఈఘటనపై బాధితుడు హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్
వినోద	టిల్లు 2
సాయిరాం	బడేమియా చోటే మియా
ఆదిత్య	గీతాంజలి మళ్లీ వచ్చింది
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	5
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	2
పచ్చిమిర్చి	44		10
కాకర	40	చుక్కకూర	2
బీర	40		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	70	గోంగూర	2
గోరుచిక్కుడు	30		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	25		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	34	పుదీన	1
క్యాప్సికం	66		20

-ఖమ్మం వ్యవసాయం

ఎగిసిన మంటలు..!


డంపింగ్ యార్డ్‌లో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది


ఇళ్ల వైపు వ్యాపిస్తున్న పొగ

డంపింగ్ యార్డ్‌లో కాలుతున్న వ్యర్థాలు

- మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్న సిబ్బంది
- అలుముకున్న పొగతో స్థానికుల అవస్థలు
- వ్యర్థాలను వేరు చేస్తూ నియంత్రిస్తున్న అధికారులు
- 24 గంటలకు పైగా ఆరకపోవడంతో భయాందోళనలో స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్‌యార్డ్‌లో వ్యర్థాలకు మంటలు అంటుకున్నాయి. బుధవారం సాయంత్రం ప్రైవేట్ స్థలం నుంచి వచ్చిన మంటలు డంపింగ్‌యార్డ్‌లోని వ్యర్థాలకు అంటుకోవడంతో ఒక్కసారిగా చెలరేగాయి. దీంతో వ్యర్థాలకు మంటలు అంటుకోవడంతో గమనించిన డంపింగ్‌యార్డ్ సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో బుధవారం రాత్రి అధికారులు ఫైర్ ఇంజన్, వాటర్ ట్యాంకర్లతో ఘటనా స్థలానికి చేరకుని మంటలను ఆర్పేందుకు ఎంత శ్రమించినా అవి అదుపులోకి రాలేదు. దీంతో యార్డ్‌లోని కొంత భాగంలో వ్యర్థాలు కాలిపోయాయి. ఇక గురువారం ఉదయం ఎండ తీవ్రతకు మరోసారి మంటలు పెద్దఎత్తున ఎగిసిపడడంతో సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. డంపింగ్‌యార్డ్ అంతటా మంటలు వ్యాపించకుండా జేసీబీలతో వ్యర్థాలను విడదీస్తూ, పైన మట్టి కప్పే ప్రయత్నం చేశారు. గురువారం సాయంత్రం వరకు మంటలు అదుపులోకి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అంతేకాక మంటలు వ్యాప్తి చెందుతాయోనని భయాందోళనకు గురవుతున్నారు.

అలుముకున్న పొగ..

డంపింగ్ యార్డ్‌లో ఎకరన్నరకు పైగా స్థలంలోని వ్యర్థాలకు మంటలు వ్యాపించడంతో యార్డ్ చుట్టూ పొగలు అలుముకున్నాయి. 24 గంటలకు పైగా వ్యర్థాలు కాలుతుండడంతో వాటి నుంచి వచ్చే పొగతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఒక పక్క ఎండ వేడిమి, మరో పక్క డంపింగ్ యార్డ్‌లోని మంటలతో ఆ చుట్టుపక్కల ప్రజలు శ్వాస తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం సాయంత్రం అంటుకున్న మంటలను ఆర్పేందుకు అధికారులు, సిబ్బంది ఎంతా ప్రయత్నించినా గురువారం రాత్రి వరకు వ్యర్థాలు కాలుతూనే ఉన్నాయి. దీంతో అధికారులు నిర్లక్ష్యం కారణంగానే వ్యర్థాలు తగలబడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, పొగ గురువారం రాత్రి రామన్నపేట వరకు వ్యాపించడంతో స్థానికులు కార్పొరేటర్ నిరంజన్ ఇంటిని చుట్టుముట్టారు.

చెత్తను విడదీస్తున్నాం..

డంపింగ్‌యార్డ్‌లో వ్యర్థాలకు అంటుకున్న మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టాం. మంటలు వ్యాపిస్తుండడంతో వ్యర్థాలను వేరు చేసి మట్టి కప్పుతున్నాం. గురువారం అర్ధరాత్రి వరకు మంటలను అదుపు చేస్తాం. మంటలను ఆర్పేందుకు కొన్ని ప్రతికూల అంశాలు ఎదరవుతున్నాయి. మంటలను అదుపు చేసే చర్యలను వేగవంతం చేశాం.

– సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్, కేఎంసీ

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా..

బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు


రఘునాథపాలెం: వీవీపాలెంలో పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న తాండ్ర

ఖమ్మంలీగల్/రఘునాథపాలెం: జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. గురువారం ఖమ్మం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, న్యాయ శాఖ ఉద్యోగులను ఓట్ల అభ్యర్థించిన సందర్భంగా, రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అత్యధిక నిధులు తీసుకొచ్చి ఖమ్మంను మరింతగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. అలాగే వీవీపాలెంలో 200 మంది తాండ్ర సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన వెంట బీజేపీ లీగల్ సెల్ నాయకుడు హర్కార్ శ్రీ రామారావు, తెల్లాకుల రమేష్‌బాబు, ఎస్.వెంకటేశ్వర గుప్తా, పి.రంగారావు, శేషాద్రి శిరోమణి, పసుమర్తి లలిత, ఎస్‌సీహెచ్ రమాదేవి, మందా సురేష్, బండారు నరేష్, బీజేపీ లీగల్ సెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం..

ఖమ్మంమామిళ్లగూడెం/రఘునాథపాలెం: తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యాన 25వ డివిజన్‌లో గురువారం బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లిలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన, ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మారుతి, శేష ఫణికుమార్ శర్మ, పసుమర్తి సంతోష్, కోటేరు మోహన్‌రెడ్డి, కాంపాటి వెంకన్న, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌ను విజయవంతం చేయండి

ఖమ్మంరూరల్: నేడు తాండ్ర నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యాన బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో ఆ పార్టీ పాలేరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాండ్రను గెలిపించడానికి నియోజకవర్గం ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కన్నీటి కోటయ్య, తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, అనంత ఉపేందర్‌గౌడ్, ఎం.కృష్ణారావు, వీరెల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ బస్సు, లారీ ఢీ..

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి వద్ద ఆర్‌టీసీ బస్సు, లారీ ఢీకొనగా, ప్రయాణికులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పైనంపల్లి వద్ద జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న టోల్‌గేట్ సమీపాన గురువారం బస్సు, లారీ ఢీకొన్నాయి. ఖమ్మం నుంచి కోదాడ వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు, కోదాడ నుంచి నేలకొండపల్లి వస్తున్న లారీ ఢీకొనగా.. పెద్దశబ్దం రావడంతో బస్సులోని ప్రయాణికులు ఆందోళన చెందారు. ఈ ఘటనలో రెండు వాహనాలు దెబ్బతిన్నా బస్సుడ్రైవర్ అప్రమత్తతతో ఎవరికీ ప్రమాదం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

కూసుమంచి మండలంలో...

కూసుమంచి: మండలంలోని ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి లింగారం తండా వద్ద గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుండి డీసీఎం ఢీకొట్టింది. ఈఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కొత్తగూడెం డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ వెళ్తుండగా లింగారంతండా సమీపాన ప్రయాణికుల కోసం డ్రైవర్ ఆపాడు. ఈక్రమంలోనే వెనుక నుండి వచ్చిన డీసీఎం ఢీకొట్టగా ప్రయాణికులకు ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, డీసీఎం అద్దాలు పగలగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో పంపించారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

50 రోజుల పాటు నిర్వహణ


మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న నిఖిల్

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు నగరంలోని గాంధీచౌక్ సెంటర్‌లో ప్రతి ఏటా మాదిరిగానే గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాంధీచౌక్ వరప్రధాత షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కుమారుడు నిఖిల్ ప్రారంభించారు. 50 రోజుల పాటు కొనసాగనున్న ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం గాంధీచౌక్, వ్యవసాయ మార్కెట్, పొట్టి శ్రీరాములు రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షిర్డీ సాయిబాబా మందిరం చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, సామ్రాజ్య లక్ష్మి దంపతుల తో పాటు కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, సాయిబాబా మందిరం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ స్థల పరిశీలన

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ స్థలాన్ని ఖమ్మం ఆర్డీఓ గణేష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సుధాకర్, ఆర్ఐ సక్రు తదతరులు ఉన్నారు.

ముమ్మరంగా చెరువు మట్టి తోలకాలు


చెరువుమాధారంలో మట్టి పోస్తున్న కూలీలు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువు మట్టిని రైతులు పొలాలకు తొలుకుంటున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు చెరువుమాధారం, నేలకొండపల్లి తదితర చెరువుల మట్టిని ట్రాక్టర్లలో నింపుతుండడంతో రైతులు తమ పొలాలకు తోలించుకుంటున్నారు. జేసీబీ, ట్రాక్టర్ ఖర్చులు లేకుండా ఉండడంతో పాటు సారవంతమైన నల్లమట్టి కావటంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

నాటడం.. నరకడం.. తగలబెట్టడం



లింగాల-పాన్నేకల్ రహదారిలో ఎండిన చెట్లు (ఇన్‌సెట్) నిప్పు పెట్టడంతో కాలిపోయి నేలవాలిన చెట్టు

కామేపల్లి: హరితహారంలో నాటిన మొక్కలు చెట్లయ్యాయి. చల్లని నీడను ఇస్తాయనుకునే సమయాన కొంతమంది నిప్పుపెట్టి కాల్చి వేయడంతో అవి ఎండిపోయి రహదారిపై పడుతున్నాయి. తద్వారా అటుగా ప్రయాణించే వారు ఎప్పుడు చెట్లు విరిగిపడతాయోనని భయాందోళనకు గురవుతున్నారు. కొంతమంది రైతులు చెట్ల మొదట్లో చెత్తను వేసి కాల్చడంతో అవి పూర్తిస్థాయిలో కాలిపోక ఎండిపోయి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లింగాల–పాన్నేకల్ మధ్య చెట్లు ఎక్కువగా ఎండిపోయి కనిపిస్తున్నవి. ఓ రైతు చెట్లకు నిప్పు పెట్టడంతో పెద్ద పెద్ద చెట్లు కాలిపోయి నేలకొరిగి రహదారిపై పడపోయాయి. అయితే వాటిని తొలగించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా రాములోరి పట్టాభిషేకం


ఖమ్మంగాంధీచౌక్‌లో పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీ సీతారాముల కల్యాణ ఘట్టం అనంతరం గురువారం నిర్వహించిన పట్టాభిషేకం కార్యక్రమాన్ని భక్తులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి కనకాభిషేకం పండితులు నిర్వహించి పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే నేడు జరగనున్న పుష్పాభిషేకం, సదస్యం కార్యక్రమాలను నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంఅర్బన్: ఇందిరానగర్ పర్ణశాల రామాలయం వద్ద పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు


ఖమ్మంఅర్బన్: పట్టాభిషేకం వేడుకలో పాల్గొన్న భక్తులు

అలరించిన కూచిపూడి నృత్యాలు


మెమెంటోలతో చిన్నారులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని మామిళ్లగూడెం రామాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నాట్యమయూరి మీనా నృత్యాలయం శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శనలు భక్తులు, ప్రేక్షకులను అలరించాయి. రామాయణం, శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ ఘట్టం తదితర అంశాలపై రూపొందించిన కూచిపూడి నృత్యాలను బాలికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శకులకు రామాలయ నిర్వాహకులు, అర్చకులు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో నాట్యాలయం నిర్వాహకురాలు ఏలూరి మీనా తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పడిగ ఎర్రయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో అభివృద్ధి నిరోధక, విదేశాంగ విధానాలు అనుసరిస్తున్న మతతత్వ బీజేపీని ఓడించి కమ్యునిస్టు విప్లవకారులను గెలిపించాలని భారత కమ్యునిస్టు, విప్లవకారుల సమైఖ్యతా కేంద్రం (మార్కిస్టు-లెనినిస్టు) ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుడు దండా లింగయ్య, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో యూసీసీఆర్ (ఎంఎల్) 11 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తుందని, అందులో భాగంగా ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా దండా లింగయ్య, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పడిగ ఎర్రయ్య పోటీ చేస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా ప్రజలను బీజేపీ తన విధానాలతో రెండో శ్రేణి పౌరులుగా జీవించే స్థితికి దిగజార్చిందని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో కల్తీ రామచంద్రయ్య, లెనిన్, నవోదయ కళాకారుడు రాము, తండూరి సంధ్య, షేక్ అక్బరున్నిసా బేగం, గడ్డి వెంకటనర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోతలోనే విధులు..


ఉక్కపోతలోనే విధులు నిర్వర్తిస్తున్న కార్గో సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో బుకింగ్ పాయింట్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల పాటు బుకింగ్ కౌంటర్‌లలో కూర్చుని విధులు నిర్వర్తించే సిబ్బందికి కనీసం ఫ్యాన్ కూడా లేకపోవడంతో ఉక్కపోతకు గురవుతున్నారు. మరో పక్క బుకింగ్ కోసం వచ్చే వినియోగదారులు సైతం గాలి లేక అల్లాడిపోతున్నారు. కార్గో ద్వారా ఆదాయం పొందుతున్న సంస్థ యాజమాన్యం సిబ్బందికి కనీసం కూలర్లు ఏర్పాటు చేయవచ్చు కదా వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. చిన్న స్టాండ్ ఫ్యాన్ ఏర్పాటు చేయగా అది సక్రమంగా పనిచేయక పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

తాగునీటి సమస్య రానివ్వొద్దు


మాట్లాడుతున్న డీఈఈ ఓం ప్రకాష్

నేలకొండపల్లి: పంచాయతీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి వనరులను అద్దెకు తీసుకోవాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదలైనందున అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. అలాగే ఉపాధి కూలీలకు తాగు నీరు, నీడ తదితర సౌకర్యాలు కల్పించేందకు చర్యలు తీసుకుంటామన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా వాటరింగ్ నిత్యం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఓం ప్రకాష్, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి


కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంరూరల్: ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌నేని వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తెల్దారుపల్లిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూలీలకు రోజుకు రూ. 600 ఇవ్వాలని, పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని, దూర ప్రాంతాల కూలీలకు రవాణా చార్జీలు భరించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, పిల్లలకు ఆయాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.నాగేశ్వరరావు, లక్ష్మి, ఉష, అనసూయ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 | మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957